క్లుప్తంగా

మానవత ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మానవత సంస్థ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. గవరవరం గ్రామానికి చెందిన నందికట్ల శ్యాం ప్రకాష్ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న మానవత సంస్థ సభ్యులు వైద్య ఖర్చులు నిమిత్తం ప్రకాష్‌కు రూ.4 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవత సంస్థ అధ్యక్షుడు మాటూరు సుధీర్, ఉపాధ్యక్షుడు మందపాటి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

తారాజువ్వ పడి ఇల్లు దగ్ధం



కొయ్యలగూడెం 8వ వార్డులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొయ్యలగూడెం: తారాజువ్వ పడి ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం కొయ్యలగూడెంలో చోటుచేసుకుంది. స్థానిక 8వ వార్డు రామాలయం ఎదుట ఓ వ్యక్తి భౌతిక కాయం ఊరేగిస్తున్న సమయంలో బాణసంచా జువ్వలు వేశారు. అందులో ఒకటి పక్కనే ఉన్న పిండింటి భానుకి చెందిన ఇంటిపై పడి అగ్నిప్రమాదం సంభవించింది. జంగారెడ్డిగూడెం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటిలోనే సామాన్లు దగ్ధమయ్యాయి. తమకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు భాను వాపోయాడు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి



కన్నాపురంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

కొయ్యలగూడెం: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ సభ్యులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కన్నాపురం, రాజవరం, బయ్యనగూడెం, కొయ్యలగూడెం, దిప్పకాయలపాడు గ్రామాల్లో ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ సభ్యులు మాట్లాడుతూ హిందూ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని హైందవ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ వనవాసి ఆశ్రమ ప్రచారక్ ప్రసాద్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

600 మందికి వైద్యసేవలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: స్థానిక కొత్తూరు రోమన్ కేథలిక్ మిషన్ చర్చి విచారణ గురువు గోగు పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ ప్రార్థన మందిరం ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో జంగారెడ్డిగూడెం నిర్మల ఆసుపత్రి సిబ్బంది అన్ని రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, గుండె సంబంధిత వంటి అనేక వ్యాధులకు సంబంధించి సుమారు 600 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ శిబిరంలో కామవరపుకోటకు చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఏసుక్రీస్తు ప్రేమ మార్గం సమస్త మానవాళికి అనుసరణీయమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కేఆర్‌పురంలో ఆదివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలరాజు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోకానికి రక్షకుడిగా వచ్చాడని, క్రీస్తు వలే ప్రతి ఒక్కరూ ఇతరులను ప్రేమించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల క్రైస్తవ గీతాల నృత్యాలు, క్రీస్తు పుట్టిక నాటికలు ఆకట్టుకున్నాయి. దైవజనులు రాజు, సర్పంచ్ ఉయికే బొజ్జి, సంఘ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు బానోతు కృష్ణనాయక్, శివాజీ, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బస్సులతో కాలక్షేపం

- తరచూ మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు
- ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు
- జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో పరిస్థితి



గేర్‌బాక్స్ సమస్యతో డిపోకు తీసుకువచ్చిన ఆర్టీసీ బస్సు (ఫైల్)



జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో వద్ద వేచి చూస్తున్న ప్రయాణికులు (ఫైల్)

జంగారెడ్డిగూడెం: కాలం చెల్లిన బస్సులతో ఆర్టీసీ కాలక్షేపం చేస్తోంది. దీంతో బస్సుల్లో తరచూ సమస్యలు ఎదురై మొరాయిస్తున్నాయి. గమ్యస్థానాలకు చేర్చకుండా తరచుగా బస్సులు మధ్యలోనే ఆగిపోతుండడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రధాన పట్టణాలకు బస్సులు నడుపుతుంటారు. ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అధిక సర్వీసులతో ప్రజలకు సేవలు అందిస్తూ చేరువగా ఉంది. అయితే గత కొంతకాలంగా జంగారెడ్డిగూడెంకు చెందిన ఆర్టీసీ బస్సులు గమ్యస్థానాలకు చేరేలోపే ఏదో ఒక సమస్యతో ఆగిపోతున్నాయి. తరచుగా ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో నిర్వహణ తీరుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

- నవంబర్ 24న జంగారెడ్డిగూడెం డిపో నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరిన బస్సు స్థానిక లక్ష్మీ థియేటర్ దగ్గరకు వచ్చేటప్పటికి బస్సు గేర్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డిపోకు మళ్లించారు. డ్రైవర్ డిపోలో ప్రయాణికులను దింపి గ్యారేజ్ కి వెళ్లి మరమ్మతులు చేయించుకున్నారు. పది నిమిషాలలో తిరిగి వచ్చిన అదే బస్సు ప్రయాణికులను ఎక్కించుకొని, తాడేపల్లిగూడెం బయలుదేరింది. ఈసారి బస్సు జంగారెడ్డిగూడెం పాత బస్టాండ్ దాటేటప్పటికీ బస్సులోని గేర్ వ్యవస్థలో సమస్య మళ్లీ తలెత్తింది. దీంతో బస్సును మళ్లీ డిపోకు మళ్లించారు. చివరికి వేరే బస్సు బయలుదేరింది.
- అక్టోబర్ 14వ తేదీన జంగారెడ్డిగూడెం - ఏలూరు రూట్‌లో ఉప్పలపాడు సమీపంలో బస్సు ఆగిపోయింది. అలాగే జంగారెడ్డిగూడెం - పోలవరం రూట్‌లో సైతం బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సులు సరైన కండీషన్‌లో ఉండేలా చూడాలని, బస్సులు కాలం చెల్లితే కొత్తబస్సులు డిపోనకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణ సరిగా చేయాలి

బస్సుల నిర్వహణ సరిగా చేయాలి. సర్వీసుకు పెట్టే ముందే బస్సు కండీషన్ సరి చూసుకుని బస్సును డిపో నుంచి బయటకు వదలాలి. ప్రయాణ సమయంలో బస్సులు మొరాయించడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాం. తరచుగా ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం సరైనది కాదు. అధికారులు చర్యలు తీసుకోవాలి

– ఎం.రాజు, జంగారెడ్డిగూడెం

సమయం వృథా అవుతోంది

బస్సులు మొరాయించడంతో సమయం వృథా అవుతోంది. అత్యవసర పనులపై వెళ్లే వారికి మరీ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లేటప్పుడు బస్సులు ఆగిపోవడం వలన ప్రయాణాలు చేయడం కష్టంగా ఉంటోంది. నిర్వహణ తీరును మెరుగుపర్చడంతోపాటు, నూతన బస్సుల ఏర్పాటుకు అధికారులు కృషిచేయాలి

– కె. వినోద్‌కుమార్, జంగారెడ్డిగూడెం

శివయ్యకు రుద్రాభిషేకం



శివదేవునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుడికి నంది వాహనంపై గ్రామోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

శివపార్వతులకు పల్లకీ సేవ



శివపార్వతులకు పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతులకు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన ఆలయ ప్రధానార్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో సోమవారం చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆలయ కమిటీ వారిని సంప్రదించాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చింతలపూడి: బహుజన టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కె.గిరిబాబు, పి శ్రీనివాసరావు, డి స్వాతి, ఏ బాబురావు, టి బాలస్వామి, కె సమర్పణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన గాయనీమణులు వేదుల జయలక్ష్మి, గుడిపాటి వెంకటరత్న శిరీష ఆలపించిన త్యాగరాజ భక్తి సంకీర్తనలు అందరినీ అలరించాయి.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం



పాతూరి రాంబాబు దంపతులకు షష్టిపూర్తి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో కె.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావు సంఘం కార్యకలాపాలను వివరించారు. స్థానిక 17వ వార్డు కార్పొరేటర్, రాష్ట్ర క్షత్రియ సంఘం డైరెక్టర్ నంబూరి రామచంద్రరావును సన్మానించారు. నూతనంగా అసోసియేషన్‌లో చేరిన దాట్ల అన్నపూర్ణాదేవి ప్రశాంత జీవితం గడపడానికి పలు సూచనలు చేశారు. గుమ్మడి సుందరరావు భవన నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. సంఘ సభ్యులు పాతూరి విజయ, జయవరపు మల్లికార్జునరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. అలాగే పాతూరి రాంబాబు దంపతులకు షష్టిపూర్తి నిర్వహించారు.

శ్రీవారి క్షేత్రం ప్రధాన రహదారి పరిశీలన



గుడిసెంటర్‌లో రహదారి విస్తరణ మార్కింగ్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో విస్తరించనున్న ప్రధాన రహదారిని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆదివారం పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ఆళ్వార్ సదనం వరకు రహదారి విస్తరణకు అధికారులు మార్కింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. అలాగే విస్తరణ కారణంగా గృహ, వ్యాపార దుకాణాలను కోల్పోయే బాధితులు ఎమ్మెల్యే మద్దిపాటిని కలసి, తమ సమస్యను ఇప్పటికే విన్నవించారు. అవసరానికి మించి భవనాలను తొలగించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి విస్తరణ జరగనున్న ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

సీపీఐ కార్యాలయం కూల్చివేత దుర్మార్గమైన చర్య



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

బుట్టాయగూడెం: సీపీఐ కార్యాలయాన్ని కూల్చడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర గిరిజన సమైఖ్య కార్యదర్శి కారం దారయ్య అన్నారు. మండలంలోని తూర్పురేగులకుంటలో సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న దారయ్య మాట్లాడుతూ గత 30, 40 సంవత్సరాలుగా సీపీఐ ఆధ్వర్యంలోనే ఆ స్థలం ఉందని చెప్పారు. రాజకీయ కుట్ర కోణంతోనే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చోడెం దుర్గ, బేతి కిశోర్, బుద్దుల ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

టి.నరసాపురం: బుట్టాయిగూడెంలో సీపీఐ కార్యాలయాన్ని కూల్చివేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, అందుకు సహకరించిన మండల తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు, సీపీఐ ఏలూరు జిల్లా సమితి సభ్యుడు బొల్లినేని నాగార్జునసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో సీపీఐ నిర్వహించిన పోరాటాలకు ఆకర్షితులై ఇటీవల కాలంలో వందలాదిమంది పార్టీలో చేరుతున్నారన్నారు. ఇది చూసి సహించలేని కొందరు దళారులు సీపీఐ ఆఫీసు కూల్చివేతకు పాల్పడ్డానన్నారు. కూల్చివేసిన కార్యాలయాన్ని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



అమ్మవార్లకు సారెను సమర్పిస్తున్న భక్తులు

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు భక్తులు సారెను సమర్పించారు. బొర్రంపాలెం కోదండరామస్వామి ఆలయంలో సీతాదేవికి, గోదాదేవికి సారె, చీరలను భక్తులు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల వికాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో తిరుప్పావై పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఎం.రాంబాబు, స్థానికులు జోగేశ్వరరావు, ముత్తేశ్వరరావు పాల్గొన్నారు.

– టి.నరసాపురం

రవికుమార్‌కు పర్యావరణ కవి పురస్కారం



విజ్ఞాన్ తెలుగు ఉపాధ్యాయుడు చొదిమెళ్ల రవికుమార్‌కు పురస్కారం అందించి సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన చొదిమెళ్ల రవికుమార్‌కు ఘన సత్కారం లభించింది. పెదవేగి మండలం భోగాపురంలోని విజ్ఞాన్ వరల్డ్ ఒన్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చొదిమెళ్ల రవికుమార్ ఈనెల 28,29 తేదీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో 6 ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన యువగళ సమ్మేళనంలో పాల్గొని, ఓ మానవ.. మానవ ×అనే శీర్షికతో కవితా పఠనం చేసి అందరి అభినందనాలు పొందారు. మహాసభల నిర్వాహకులు రవికుమార్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను, పర్యావరణ కవి పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుడు రవికుమార్ సాహిత్య అభ్యున్నతిని కొనియాడుతూ ఉపాధ్యాయులు, మిత్రులు, బంధువులు అభినందించారు.

రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

దెందులూరు: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం దుద్దికుంటలో కొమ్మెర నాగేంద్ర అనే రైతు కుటుంబం (నలుగురు) మొత్తం సామూహిక ఆత్మహత్యకు పాల్పడి మరణించిన ఘటన ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది, కంట తడిపెట్టిస్తుందని కాని ప్రభుత్వాన్ని కదిలించలేకపోవడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు అన్నారు. ఆదివారం దెందులూరులో రైతు ఆత్మహత్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో నష్టాలతో ఏలూరు జిల్లాలో, రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక మూల రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయని అన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతులు, కౌలు రైతులకు సంబంధించిన అన్ని రకాల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ఆదుకోవాలన్నారు. పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు తగ్గించేందుకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాల ధరలను అదుపు చేయాలన్నారు. రైతులు వ్యవసాయ పెట్టుబడి కోసం బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉచిత పంటల బీమా అమలు చేయాలన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు తీసుకోవలసిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రాష్ట్రంలో రైతు సంఘాలు, రైతుల సమస్యలపై పని చేస్తున్న స్వచ్ఛంద సంఘాలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకుని అమలు చేయాలని కోరారు.

సుద్దనీరు వద్దంటూ నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పోలవరం రూరల్: సుద్దనీటితో ఇక్కట్లు పడుతున్నామని, తక్షణమే సురక్షిత మంచినీటిని అందించాలని కోరుతూ ఆదివారం పోలవరం మండలంలోని కోయనాగంపాలెం గ్రామస్తులు తాగునీటి ట్యాంక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చాలాకాలంగా గ్రామంలో మంచినీరు సుద్ద రూపంలో వస్తుందని, దీంతో తమకు కీళ్ల వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గ్రామానికి వచ్చినా సమస్యను పరిష్కరించడం లేదని వాపోయారు. ఈ నీటిని పరీక్షలు జరిపి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. గ్రామంలో వేరేచోట బోర్ మోటార్ వేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు మంచినీటి కోసం దొండపూడి దూర ప్రాంతాలకు వెళ్లి కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని, తక్షణమే గ్రామానికి సురక్షిత మంచినీరు అందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఎం పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మడివి చలపతిరావు, మిడియం పండు, మడివి రాంబాబు, సవలం జయలక్ష్మి, మిడియం గంగరాజు, సవలం అమ్మాజీ, సవలం దుర్గ, అర్జునమ్మ, మడకం నాగేశ్వరావు, రాజు, వీరాయమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతను నివారించాలి

ఏలూరు (టూటౌన్): రబీ సాగు చేస్తున్న రైతులకు ఎరువులు లభించక ఇబ్బందులు పడుతున్నారని, ఎరువుల కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఏలూరు, అన్నే భవనంలో ఆదివారం ఆయన ఎరువుల కొరతపై మాట్లాడారు. డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో లేవన్నారు. ప్రైవేట్ వ్యాపారుల వద్దనే కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఎరువులు కొరత ఉందని సాకు చూపి అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, అందుకు వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో ఎరువులు నిల్వల వివరాలు ప్రకటించాలన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు మధురాతి మధురం



చింతలపూడి: 1984-87 బ్యాచ్ పదవ తరగతి, ఇంటర్ పూర్వ విద్యార్థులు



పోలవరం రూరల్: గూటాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చింతలపూడి: పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలిసి సందడి చేశారు. మండలంలోని చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్ 1984-87 పదవ తరగతి, ఇంటర్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి మిత్రులంతా కలుసుకుని అప్పటి మధుర స్మృతులు, అల్లరి వేషాలు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. దేశ విదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన విద్యార్థులతో పాటు అమెరికాలో స్థిరపడిన రాజీవ్ లోచన్ ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావడం విశేషం. ఆనాడు గురువులు చెప్పిన చదువు వల్లే తామంతా మంచి స్థితిలో ఉన్నామని గుర్తుచేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవాలని తీర్మానించారు. పాఠశాల హెచ్ఎం డా సుధాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు జి రవికుమార్, కంచర్ల సురేష్, ఆకుల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పోలవరం రూరల్: గూటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1984-85 బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు కలిసి సందడి చేశారు. వివిధ ప్రదేశాల్లో, వేర్వేరు వృత్తుల్లో స్థిరపడిన వీరంతా ఒక్కచోట కలుసుకోవడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకొని, ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మైగాపుల దుర్గాప్రసాద్, జల్లెపల్లి ధర్మరాజు, గిద్దా రామకృష్ణ, రావూరి పుష్కరం, మంహంతి వెంకటేశ్వరరావు, మొగళ్ళ జ్యోతి, పూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.